## క్లుప్తంగా

### బాలల్లో దేశభక్తి స్ఫూర్తి నింపాలి



బాలలకు జెండాలు అందించిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేటి బాలల్లో భారత దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పి వారిలో దేశభక్తి స్ఫూర్తిని నింపడానికి నేటి తరం కృషి చేయాలని యాంటీనోరీ సోషల్ సర్వీస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి తోట ఎడ్వర్డ్ అన్నారు. ఈ నెల 15వ తేదీ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని బీడీ కాలనీలో పిల్లలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. సొసైటీ ప్రతినిధులు జి.సునీత, జి.రాజ్యలక్ష్మి, పి.లక్ష్మి, ఎం తులసి తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ప్రస్తుత సీజనల్‌లో ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతి సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 20వ డివిజన్ పరిధిలోని ఎన్‌ఆర్‌పేట, రైల్వే ట్రాక్ రోడ్, ఏటి గట్టు రోడ్డు, ఎన్‌ఆర్‌ఐ కాలేజీ రోడ్, ఓల్డ్ పోస్టాఫీస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలంలో ఉన్న నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. నాయకులు ఆర్‌ఎస్‌ఆర్ నాగేశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల స్వామి, మలేరియా మేస్త్రి డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఏడుకొండలు పాల్గొన్నారు.

### చర్చలంటూ జాబితాల ప్రకటన సరికాదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఒక వైపు ఉపాధ్యాయ సంఘాలతో చర్చలంటూనే మరో వైపు సర్దుబాటుకు సంబంధించిన మిగులు ఉపాధ్యాయుల జాబితాలు ప్రకటించడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర ఒక ప్రకటనలో అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని కోరారు.

### నేడు విగ్రహాల ఆవిష్కరణ

దెందులూరు: స్థానిక హైస్కూల్లో గురువారం ఉదయం సరస్వతి అమ్మవారు, దాత హైమావతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

# నగరంలో అంధకారం

ఏలూరు నగరంలో కొన్ని రోజులుగా అనధికార విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. రాత్రివేళల్లో ఏ క్షణాన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందో తెలియక నగర ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక వైపు దోమల బెడద, మరోవైపు విద్యుత్ కోతలతో నిద్రలేక పిల్లలు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వ్యాపార కూడళ్లలో కొత్తపేట, గాంధీనగర్, తంగెళ్లమూడి, ఎన్‌ఆర్‌పేట, ఆర్‌ఆర్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉంటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు నగరంలో పవర్‌కట్‌కు సంబంధించి కొన్ని చిత్రాలివి. – సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు







ఏలూరులోని ఎన్‌ఆర్‌పేట, ఆర్‌ఆర్‌పేటలో పవర్‌కట్ దృశ్యాలు

# ప్రొటోకాల్ అమలు చేయాలి

సర్పంచ్‌ల డిమాండ్

ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తన అనుచరుల ఒత్తిడి కారణంగా అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్‌లను ఆహ్వానించడం లేదని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదంటూ మల్కాపురం సర్పంచ్ పత్యాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు సరైన గౌరవం ఇవ్వకుండా గ్రామ స్వరాజ్యం సాధిస్తామంటూ ప్రభుత్వ పెద్దలు, సుద్దులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ తరగతి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు గళమెత్తారు. సునీత మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరిగిన పాఠశాల పిల్లల యూనిఫారం పంపిణీ కార్యక్రమానికి సైతం తనను పిలవలేదని వాపోయారు. మల్కాపురం గ్రామం ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ (ఇడా) పరిధిలోకి చేర్చినందున స్థానిక ఆశ్రం ఆసుపత్రి యాజమాన్యం, ఆటో నగర్ అభివృద్ధి పన్నులను గ్రామం కోల్పోతోందని తెలిపారు. కనీసం 30 శాతం ఇడా నిధులు సైతం గ్రామానికి విడుదల చేయాలని కోరారు. మాదేపల్లి సర్పంచ్ కొరపాటి శ్రీరామ్ ప్రభుదేవ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు పాలకవర్గాలకు అప్పగిస్తే అభివృద్ధి చేసి ఆదాయం రాబట్టుకుంటామని తెలిపారు. గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డుల వద్ద అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సైతం పోలీసుల పహారా నిర్వహించాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించడానికి ఏడాదికి రూ.5 లక్షలు ఖర్చవుతోందని చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు తెలిపారు. ఇందులో సిబ్బంది జీతాలు, వాటర్ ప్యూరీఫై సిస్టమ్ మరమ్మతులు ఖర్చులు ఏటా పెరిగిపోతున్నాయన్నారు. తాగునీరు సరఫరా వ్యవస్థలను జిల్లా పరిషత్ నిర్వహించాలని కోరారు.



అధికారులకు సమస్యలు వివరిస్తున్న చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు

**ఇడా నిధులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి**

సర్పంచ్‌లు లేవనెత్తిన ప్రశ్నలకు జెడ్పీ సీఈఓ కేవీవీ సుబ్బారావు సమాధానం ఇస్తూ తాగునీరు సరఫరా వ్యవస్థ పంచాయతీలే నిర్వహించుకోవాలన్నారు. గతంలో సైతం ఇడా నిధులు పంచాయతీలకు అందించాలన్న విజ్ఞాపనలు ప్రభుత్వాలకు అందాయని తెలిపారు. ఈ అంశం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు. దీనిపై సర్పంచ్‌లు స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకెళితే ఫలితం ఉంటుందన్నారు.

**గ్రామాభివృద్ధి సాధించాలి**

డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తోందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఒక్కొక్క పంచాయతీకు రూ.10 వేలు నుంచి రూ.25 వేలు మంజూరు చేసిందన్నారు. పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తుందని తెలిపారు. ఎంపీడీఓ బి.ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ శాఖ షాపుల అద్దెకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు టౌన్: స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ సమీపంలోని పోలీస్ దుకాణ సముదాయాల్లో షాపులు, పోలీస్ క్యాంటీన్ అద్దె ప్రాతిపదికన లీజుకు వచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ దుకాణ సముదాయాల్లోని షాపు నెంబర్ 2, 3, 4, 5, 6లను అద్దెకు ఇవ్వనున్నామని తెలిపారు. ఎక్కువ అద్దెకు టెండర్ దరఖాస్తు సమర్పించిన వారికి షాపులు, క్యాంటీన్ అద్దెకు ఇస్తామని పేర్కొన్నారు. వివరాలకు ఏఆర్ డీఎస్పీ శ్రీహరి ఫోన్ నెంబర్ 94407 96602కు సంప్రదించాలని తెలిపారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగించాలని ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు అన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, వాటి గురించిన చట్టాలపై బుధవారం నగరంలోని కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌తో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ముందుగా సరదాగా ప్రారంభమయ్యే ఈ మత్తు పదార్థాల వాడకాలు రాను రాను అలవాటుగా మారి వారి జీవన విధానాన్ని, నాడీ వ్యవస్థను కృంగతీస్తుందని వివరించారు. మాదక ద్రవ్యాలతో యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని కోల్పోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ అరుణమ్మ, స్పెషల్ బ్యూరో ఎస్సై పి.శివప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సైకాలజిస్ట్ సీహెచ్ వంశీకృష్ణ, ఏసీహెచ్ ఎస్ బాబు, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు, పోలీసు అధికారులు 70 మంది కాలేజీ అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర రావు

# ఇంద్ర ఏసీ బస్సుల ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు డిపో నుంచి హైదరాబాద్ వెళ్లడానికి, హైదరాబాద్ నుంచి ఏలూరు రావడానికి వీలుగా ఇంద్ర ఏసీ బస్సులను బుధవారం ఏలూరు కొత్త బస్టాండులో ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. సర్వీస్ నెంబర్ 4792, 4795లతో ప్రస్తుతం తిరుగుతున్న బస్సుల స్థానంలో ఈ కొత్త బస్సులు తిరుగుతాయని డిపో మేనేజర్ బి.వాణి తెలిపారు. ఛార్జీలు సైతం యథాతథంగానే ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు డిపో ఏఎంటీ బి.మురళి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ ఐ.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్ర బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే చంటి

### గోరుపై స్వాతంత్య్ర సమరయోధులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అగ్గిపుల్లలతో అతి చిన్న చిత్రాలను రూపొందించి వాటిని గోరుపై ఉంచి అబ్బుర పరిచారు ఏలూరుకు చెందిన కళాకారుడు మేతర సురేష్ బాబు. మూడు అగ్గిపుల్లలతో అల్లూరి సీతారామరాజు, మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రాలను రూపొందించారు. ఈ చిత్రాలను గోటిపై ఉంచి ఔరా అని పించారు.



# చెస్ ప్లేయర్ ప్రేమి రక్షితకు సత్కారం

ఏలూరు (టూటౌన్): పదేళ్ల వయస్సులోనే స్కూల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అండర్–10 చెస్ చాంపియన్ షిప్‌లు గెలుచుకున్న ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందని చెస్ ప్లేయర్ ప్రేమి రక్షితను జిల్లా యాదవ సంఘం నాయకులు స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం అండర్–19 జాతీయ చెస్ చాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు సాధన చేస్తోన్న రక్షిత ఘన విజయం సాధించాలని నాయకులు ఆకాంక్షించారు. రక్షిత తండ్రి యడ్ల మహేష్ స్థానికంగా చెస్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు (బుజ్జి), గొర్ల రామారావు, ఆకుల గంగాధర్, బొట్టా అజయ్, చిట్టిబోయిన సాయిబాబు, కొలుసు కృపానందరావు, కొట్టి నాగభూషణం, పసుపులూరి ప్రభు, తొందూరి అర్జున్, రక్షిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రేమి రక్షితను సత్కరించిన యాదవ సంఘం నాయకులు

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సకల ప్రాణికోటి జీవించడానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం, మంచి వాతావరణం లభించడానికి ఎంతో ముందు జాగ్రత్తగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సి సూచించారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటి ఎన్‌సీసీ క్యాడెట్లలో స్ఫూర్తి నింపారు. తమ కళాశాలలో 2024–25 సంవత్సరానికి ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ పీఎం సెలిన్ రోజ్, 19 ఆంధ్ర బెటాలియన్‌కి చెందిన ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రిథేష్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

### చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



చిన్నారులను పరామర్శిస్తున్న కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని తలసేమియా భవనంలో బుధవారం 14 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. చికిత్స పొందుతోన్న చిన్నారులను ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పరామర్శించారు. రక్తదాతల సహకారంతో తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లినేని బెనర్జీ సహకారంతో బాధిత చిన్నారులు, వారి సహాయకులు 35మందికి భోజన సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ వరప్రసాదరావు, రెడ్‌క్రాస్ నర్సింగ్ స్కూల్ చైర్‌పర్సన్ బి.పద్మజవాణి, డాక్టర్ జి.స్పందన, ఏలూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్‌జీవీబీ స్వామి, కార్యదర్శి ప్రసాద్, పీఆర్‌ఓ రమణ తదితరులు ఉన్నారు.

### ఉపాధ్యాయ ఎంపిక కమిటీ సభ్యునిగా ఆర్‌ఎస్‌ఆర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు ఉన్నత విలువలతో పాటు వారిలో అభ్యసనా సామర్థ్యాలు పెంచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయిలో అందించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉపాధ్యాయులను ఎంపిక చేసే కమిటీ సభ్యునిగా నగరానికి చెందిన రాము సూర్యారావును నియమించారు. స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో అధ్యాపకునిగా, అనంతరం ప్రిన్సిపాల్‌గా సేవలందించి ఆర్‌ఎస్‌ఆర్‌గా పిలువబడే సూర్యారావు గతంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పని చేశారు.

## ఆర్టీసీ సమాచారం

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 26 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 38 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 23 |
| ఏలూరు – తిరుపతి(ఇంద్ర) | 19.00 | 34 |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 25 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 25 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 27 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 20 |
| ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 26 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 30 |
| ఏలూరు – ఈసీఐఎల్ | 22.30 | 4814 | 23 |
| ఏలూరు – తిరుపతి | 16.00 | 4830 | 31 |

### 16 నుంచి రెవెన్యూ సదస్సులు

నిడమర్రు: భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు గ్రామాల్లోని సచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు నిడమర్రు తహసీల్దారు వై.శేఖర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.